
సాక్షి
పల్నాడు
శుక్రవారం । 17 । జనవరి । 2025



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 562.40 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 9,800 క్యూసెక్కులు విడుదలవుతోంది.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ డెల్టా ప్రధాన కాలువకు సీతానగరం వద్ద గురువారం 1616 క్యూసెక్కులు విడుదల చేశారు.



దుర్గమ్మ గుడికి రూ.లక్ష విరాళం

విజయవాడ: ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో నిత్యాన్నదానానికి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన శైలేంద్రనాథ్ కుటుంబం గురువారం రూ.లక్ష విరాళాన్ని అందజేసింది.

న్యూస్‌రీల్

జాతీయ భద్రతా మాసోత్సవాలు ప్రారంభం



నరసరావుపేట: జిల్లాలో గురువారం నుంచి జాతీయ భద్రతా మాసోత్సవాలు ప్రారంభమయ్యాయి. పోలీసు, కలెక్టరేట్ కార్యాలయాల్లో ఎస్పీ కంచి శ్రీనివాసరావు, జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ గనోరే రోడ్డు భద్రతా బ్యానర్లు, బ్రోచర్లు ఆవిష్కరించి మాసోత్సవాలను ప్రారంభించారు. ఈ మాసోత్సవాలు ఈనెల 16 నుంచి ఫిబ్రవరి 15 వరకు నిర్వహిస్తున్నామని జిల్లా రవాణాశాఖ అధికారి జి.సంజీవకుమార్ పేర్కొన్నారు. రవాణా శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఈనెల 10 నుంచి 16 వరకు ప్రైవేటు బస్సులపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి అధిక చార్జీలు వసూలు చేసినందుకు 38 బస్సులపై కేసులు నమోదు చేశామని పేర్కొన్నారు. మరికొన్ని వాహనాలపై 74 కేసులు నమోదు చేశామన్నారు. కార్యక్రమంలో మోటారు వాహన తనిఖీ అధికారి ఎస్.శివనాగేశ్వరరావు, సహాయ మోటారు తనిఖీ అధికారులు ఎం.మనీషా, ఎంఎల్.వంశీకృష్ణ, ఎం.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ క్యాడెట్ల ట్రెక్కింగ్ శిబిరం



గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు ఎన్‌సీసీ గ్రూప్, 10 ఆంధ్ర గర్ల్స్ బెటాలియన్ ఆధ్వర్యంలో తొలిసారిగా ట్రెక్కింగ్ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు గుంటూరు ఎన్‌సీసీ గ్రూప్ కమాండర్ కల్నల్ ఎస్.ఎం.చంద్రశేఖర్ తెలిపారు. అఖిల భారత మహిళా ట్రెక్కింగ్–3 పేరుతో గురువారం నుంచి ఈనెల 23 వరకు శిబిరంలో భాగంగా కొండవీడు, ఫిరంగిపురం కొండ, కోటప్పకొండలలో ఎన్‌సీసీ క్యాడెట్లు ట్రెక్కింగ్ నిర్వహించనున్నారని పేర్కొన్నారు. ఇందుకోసం ఆంధ్ర, తెలంగాణ పరిధిలోని తొమ్మిది ఎన్‌సీసీ గ్రూపులకు చెందిన దాదాపు 600 మంది విద్యార్థినులు గురువారం గుంటూరులోని ప్రభుత్వ మహిళా కళాశాలకు చేరుకున్నారని చెప్పారు.

ఉరుసు సందర్భంగా ట్రాఫిక్ మళ్లింపు

పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): ఈనెల 17 నుంచి 21 వరకు జరగనున్న హజరత్ కాలే మస్తాన్‌షా వలియా దర్గా ఉరుసు ఉత్సవాల్లో భాగంగా ట్రాఫిక్ మళ్లించినట్టు ట్రాఫిక్ డీఎస్పీ ఎం.రమేష్ తెలిపారు. చుట్టుగుంట వైపు నుంచి మున్సిపల్ ట్రావెల్స్ బంగ్లా (ఎంటీబీ) సెంటర్ వైపు వచ్చే కార్లు, అంతకంటే భారీ వాహనాలు ఐటీసీ కంపెనీ, నగరంపాలెం పోలీసు స్టేషన్, ఎస్‌బీఐ సెంటర్ మీదుగా ఎంటీబీ సెంటర్‌కు చేరుకోవాలని సూచించారు. చుట్టుగుంట నుంచి వచ్చే ద్విచక్ర వాహనాలు, ఆటోలు చక్కల బజారు, మూడు బొమ్మల సెంటర్ మీదుగా ఎంటీబీ సెంటర్‌కు వెళ్లాలని తెలిపారు. గుంటూరు నగరం నుంచి చుట్టుగుంట వైపు వెళ్లే వాహనాలు యథావిధిగా వెళ్లవచ్చని సూచించారు.

20 నుంచి ఇంటర్ ప్రీ-ఫైనల్స్ పరీక్షలు

గుంటూరు ఎడ్యుకేషన్: ఇంటర్మీడియెట్ విద్యార్థులకు ఈనెల 20 నుంచి 27వ తేదీ వరకు ప్రీ-ఫైనల్ పరీక్షలు జరగనున్నాయి. జిల్లాలోని ప్రభుత్వ, ఎయిడెడ్ జూనియర్ కళాశాలలతో పాటు హైస్కూల్ ప్లస్‌లలో చదువుతున్న విద్యార్థులకు ఇంటర్మీడియెట్ బోర్డు నుంచి ప్రశ్నపత్రాలు పంపిణీ చేయనున్నారు. జిల్లాలోని నాలుగు ప్రభుత్వ జూనియర్ కళాశాలలతో పాటు ఆరు ఎయిడెడ్, ఐదు కాంపోజిట్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రశ్నపత్రాలు సరఫరా చేయనున్నట్లు ఆర్‌ఐవో జీకే జుబేర్ తెలిపారు. ఇంటర్‌బోర్డు నిబంధల మేరకు ప్రీ-ఫైనల్స్ పరీక్షల నిర్వహణపై ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్‌కు మార్గదర్శకాలు జారీ చేసినట్లు చెప్పారు. అదే విధంగా ప్రైవేటు జూనియర్ కళాశాలల పరిధిలో ప్రీ-ఫైనల్ పరీక్షల నిర్వహణకు కళాశాలల యాజమాన్యాలు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.

60,180 బస్తాల మిర్చి రాక

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 60,180 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 59,267 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల సగటు ధర రూ.7,500 నుంచి రూ.15,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.7,500 నుంచి రూ.16,000 వరకు ధర లభించింది.

దాపురించిన కష్టాలు

- ధాన్యం రైతు దైన్యం
- నిలిచిన ప్రభుత్వ కొనుగోళ్లు
- ఇంకా రైతుల వద్దే ఖరీఫ్ నిల్వలు
- బయట ధర లేక అష్టకష్టాలు
- పురుల్లో దాచుకుంటున్న వైనం



శావల్యాపురంలో పురికట్టి ధాన్యం నిల్వ చేసిన దృశ్యం



ఓ రైతు ఇంటి ముందు ఆరబోసిన ధాన్యం

శావల్యాపురం: రైతు వద్ద ప్రతి ధాన్యపు గింజ మద్దతు ధరకు కొంటామని ప్రగల్భాలు పలికిన టీడీపీ కూటమి సర్కారు మాట తప్పింది. ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లు పూర్తిగా చేయలేక చేతులెత్తేసింది. ఫలితంగా అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బయట మార్కెట్‌లో గిట్టుబాటు ధర లేక పోవడంతో ధాన్యాన్ని ధర వచ్చినప్పుడు అమ్ముకుందామని పురులు కట్టి వాటిల్లో దాచుకుంటున్నారు. మాయదారి సర్కారు వల్ల కష్టాలు దాపురించాయని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొందరు రైతులు దళారులను ఆశ్రయించి తెగనమ్ముకుంటున్నారు.
ప్రస్తుతం బస్తా ధాన్యం ధర గ్రామాల్లో రూ.1,400 వరకు పలుకుతోంది. ఈ ధర ఏమాత్రం గిట్టుబాటు కాదని రైతులు చెబుతున్నారు. పురులు కట్టి ధాన్యాన్ని నిల్వ చేసుకునేందుకే మొగ్గు చూపుతున్నారు.

ఎకరానికి రూ.40వేలు ఖర్చు

గత ఖరీఫ్‌లో పల్నాడు జిల్లాలో 35వేల హెక్టార్లలో వరి సాగైంది. రెండు లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చిందని జిల్లా వ్యవసాయ అధికారి మురళీ చెప్పారు. ఒక్కో ఎకరానికి రైతులు రూ.40 వేల వరకు సాగు ఖర్చులు చేశారు. ఎకరానికి 30 నుంచి 40 బస్తాల దిగుబడి వచ్చింది. 76 కేజీల బస్తా ప్రస్తుతం బయట మార్కెట్లో రూ.1,400 పలుకుతుండగా, ఇది ఏమాత్రం సరిపోదని రైతులు భావిస్తున్నారు. ప్రభుత్వం 76 కేజీల ధాన్యం బస్తాను మద్దతు ధర రూ.1720కు కొంటామని హామీ ఇచ్చినా ఇప్పటివరకు జిల్లా మొత్తమ్మీద ఐదువేల మెట్రిక్ టన్నులు మాత్రమే కొన్నది. ఇప్పుడు కొనుగోళ్లు ఆపివేయడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు.

జిల్లాలో ఇలా..

ఖరీఫ్‌లో వరి సాగు	: 35,000 హెక్టార్లు
ధాన్యం దిగుబడి	: 2,00,000 మెట్రిక్ టన్నులు
ఇప్పటివరకు కొన్నది	: 5,000 మెట్రిక్ టన్నులు

పురి ఏర్పాటు చేసుకున్నాం



నేను నాలుగు ఎకరాల్లో వరి పంట సాగు చేశాను. కూటమి ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా మద్దతు ధరకు కొంటామని చెప్పినా ఎక్కడా కొనుగోళ్లు జరగడం లేదు. బయట మార్కెట్లోనూ గిట్టుబాటు ధరలేకపోవడంతో గత్యంతరం లేక పొలంలో పురి ఏర్పాటు చేసుకున్నాం. ప్రభుత్వం స్పందించి రైతులు పండించిన చివరి గింజ వరకు కొనుగోలు చేసి ఆదుకోవాలి.

– గంజనబోయిన కోటేశ్వరరావు, రైతు, గుంటుపాలెం

ఎరువు కట్ట ధర కూడా రావట్లే



నాలుగు ఎకరాల్లో వరి సాగు చేశా. ఎరువు కట్ట రేటు కూడా ధాన్యం బస్తాకు రావట్లేదు. మార్కెటు ధరకు అమ్ముకుంటే మిగులు ఉండదు. గ్రామానికో గిడ్డంగి సౌకర్యం కల్పిస్తే రైతులు నష్టపోకుండా ఉంటారు. ఈ ఏడాది పెట్టుబడులు పెరిగాయి. ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలి. కొనుగోలు కేంద్రాల వల్ల న్యాయం జరగడం లేదు.

– లింగా వెంకటేశ్వర్లు, రైతు, వేల్పూరు గ్రామం

కొనుగోళ్ల ప్రక్రియ జరుగుతోంది

కొనుగోళ్ల ప్రక్రియ ఎక్కడా ఆగలేదు. సంబంధిత అధికారులతో మాట్లాడతాను. ఎక్కడైనా రైతులకు ఇబ్బందులు ఉంటే వ్యవసాయాధికారులను సంప్రదించాలి. నేరుగా నాకైనా ఫిర్యాదు చేయొచ్చు.

– సూరజ్‌గనోరే, జాయింట్ కలెక్టర్, పల్నాడు జిల్లా

ఏది సారూ..!
జాతీయ జెండా



గుంటూరు రోడ్డు శివారు పార్కు మధ్యలో జాతీయ జెండా లేకుండా ఖాళీగా ఉన్న పోల్

నరసరావుపేట: జిల్లా కేంద్రమైన నరసరావుపేటకు వచ్చే వారికి స్వాగతం పలుకుతూ గుంటూరు రోడ్డు శివారులోని ఆజాదీ పార్కు మధ్యలో ఏర్పాటుచేసిన జాతీయ జెండాను మున్సిపల్ అధికారులు తొలగించి నెలన్నర అవుతుంది. ఇప్పటివరకు మళ్లీ ఏర్పాటు చేయలేదు. అప్పటి ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆలోచన మేరకు సుమారు రూ.12 లక్షల మున్సిపల్ నిధులతో 2022 ఆగస్టు 14వ తేదీన 100 అడుగుల స్తంభం(పోల్)పై జాతీయ జెండాను ఏర్పాటు చేశారు. దీని ప్రారంభోత్సవానికి అప్పటి రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని, అప్పటి కలెక్టర్ లోతేటి శివశంకర్, ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డిలు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. చూపరులకు సుమారు ఒక కిలోమీటరు దూరం నుంచే జాతీయ జెండా కన్పిస్తూ ఉండేది. అలాంటి జెండాను నెలన్నర క్రితం ఏ కారణంచేతనో తొలగించిన అధికారులు మళ్లీ ఏర్పాటు చేయలేదు. పార్కులోని మొక్కలు కూడా ఎండిపోయాయి. గత ప్రభుత్వంలో ఒక కాంట్రాక్ట్ ఉద్యోగి నిత్యం ఈ పార్కును పర్యవేక్షిస్తూ ఉండేవారు. రాష్ట్రంలో అధికారం మారగానే ఆ ఉద్యోగిని తొలగించారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే జాతీయ జెండాను ఏర్పాటు చేయాలని పట్టణ పౌరులు కోరుతున్నారు. దీనిపై మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావును వివరణ కోరగా జెండా చిరిగిందనే ఫిర్యాదుపై తొలగించామని, త్వరలో మళ్లీ ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు.

పోస్టుమార్టం నివేదిక రానిదే నిర్ధారణకు రాలేం

మద్యం తాగి ఇద్దరు మృతిచెందిన ఘటనపై ఎక్సైజ్ సీఐ తులసి



క్రోసూరు/అచ్చంపేట: అచ్చంపేట మండలంలోని చామర్రులో ఈనెల 14న మద్యం తాగడం వల్ల అనారోగ్యానికి గురై ఇద్దరు మృతి చెందారనేది నిజం కాదని, వదంతి మాత్రమేనని క్రోసూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ టి.తులసి వెల్లడించారు. పోస్టుమార్టం నివేదిక రానిదే వారిద్దరూ ఎలా చనిపోయారనే దానిపై నిర్ధారణకు రాలేమని స్పష్టం చేశారు. ఈ మేరకు గురువారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. చామర్రు గ్రామ నివాసి గౌతుకట్ల కోటయ్య (80) అనారోగ్యంతో చనిపోవటంతో అతని దహన సంస్కారాలకు హాజరైన మృతుని కుమారుడు గౌతుకట్ల నాగేశ్వరరావు, తెల్లమేకల నాగేశ్వరరావు మద్యం తాగి అనారోగ్యానికి గురై సత్తెనపల్లి ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారని, దీనిపై విచారణ చేపట్టామని తులసి వివరించారు. వారిద్దరి మృతికి మద్యమే కారణమని చెప్పలేమని, వారు తాగిన కూల్‌డ్రింక్ లేదా ఆహారంలోనూ ఏదైనా కలిసి ఉండొచ్చని పేర్కొన్నారు.

ఒక్క రాత్రిలో 15 చోరీలు

దొంగల ముఠా స్వైరవిహారం



గురజాలలో చోరీ జరిగిన ఇంటిలో క్లూస్ టీం పరిశీలన

గురజాల: దొంగల ముఠా స్వైరవిహారం చేసింది. ప్రజలంతా సంక్రాంతి సందడిలో ఉండగా ఒక్కరాత్రిలో గురజాల, దాచేపల్లి మండలాల్లో ఏకంగా 15 చోరీలకు తెగబడింది. ఈ చోరీలు జిల్లావ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయి. ఇంటికి తాళాలు వేసుకుని పండగకు ఊరు వెళ్లిన కుటుంబాలనే దొంగలు టార్గెట్ చేసుకున్నట్టు స్పష్టమవుతోంది. మంగళవారం అర్ధరాత్రి నుంచి బుధవారం తెల్లవారుజాము వరకు ఈ చోరీలు జరిగినట్టు సమాచారం. గురజాలలోని కోతమిషన్ సెంటర్‌లో రెండు ఇళ్ల తాళాలు పగలగొట్టి లోపలికి ప్రవేశించిన దుండగులు బీరువాలు పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. వస్తువులన్నీ చెల్లాచెదురుగా పడవేశారు. అలాగే పులిపాడు గ్రామంలో ఐదు ఇళ్లతోపాటు ఒక షాపులో చోరీకి తెగబడ్డారు. దాచేపల్లి మండలం నడికుడిలో ఐదు ఇళ్లు, శ్రీనివాసరావుపేటలోని రెండు ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు. పోలీసులను పక్కదారి పట్టించేందుకు దొంగల ముఠా యత్నించింది. దీనికోసం గురజాలలోని న్యాయవాది ఇంటిలో చోరీచేసిన హ్యాండ్ బ్యాగ్‌ను నడికుడిలోని ఓ ఇంటిలో, ఎక్కడో దొంగతనం చేసిన పర్సును న్యాయవాది ఇంటిలో వదిలి వెళ్లింది.

ఫలించిన పోలీసుల అప్రమత్తత

సంక్రాంతి సెలవుల ముందు నుంచే పోలీసులు ప్రజల్లో చోరీలపై అవగాహన కల్పించడంతో గ్రామీణులు అప్రమత్తమయ్యారు. ఇళ్లల్లో ఎక్కువ బంగారం, నగదు ఉంచుకోలేదు. ఫలితంగా దొంగల ముఠా 15 ఇళ్లలో చోరీ చేసినా మొత్తమ్మీద కేవలం రూ.1.50 లక్షల సొత్తును మాత్రమే చోరీ చేయగలిగిందని సమాచారం. చోరీలు జరిగిన ఇళ్లలో బుధవారం రాత్రి క్లూస్ టీం పరిశీలించింది. ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు డీఎస్పీ జగదీష్ ఆధ్వర్యంలో సీఐ భాస్కర్ పర్యవేక్షణలో క్లూస్‌టీం వేలిముద్రలు సేకరించింది. నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసింది. క్లూస్ టీం ద్వారా నిందితుల వేలిముద్రలు సేకరించామని, నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని గురజాల డీఎస్పీ జగదీష్ తెలిపారు.

పెట్టుబడి సాయం కోరుతూ నేడు బెజవాడలో రైతుల ధర్నా

ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జొన్నా శివశంకరరావు



జొన్నా శివశంకరరావు, రైతు ప్రతినిధులు

తెనాలి: ఎన్నికల సందర్భంగా తెలుగుదేశం, జనసేన పార్టీల నాయకులు రైతులకు పెట్టుబడి సాయం రూ.20 వేల చొప్పున ఇస్తామని చేసిన వాగ్దానం అమలుతో సహా పలు డిమాండ్లతో ఈనెల 17వ తేదీన విజయవాడలో నిర్వహించనున్న ధర్నాలో రైతాంగం పాల్గొనాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జొన్నా శివశంకరరావు కోరారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. 2024–25 ఖరీఫ్ సీజన్ ఇప్పటికే ముగిసిందని, రబీ సీజను కూడా సగానికి పూర్తయినా పెట్టుబడి సాయం ఇవ్వకపోవటం అన్యాయమన్నారు. ఉచిత పంటల బీమా కొనసాగించాలని, ప్రభుత్వమే ప్రీమియం చెల్లించాలని డిమాండ్ చేశారు. వాణిజ్య, ఉద్యాన సహా మిగిలిన అన్ని పంటలకు ధరలు పడిపోకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి మాట్లాడుతూ విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ప్రభుత్వం ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. అదనపు చార్జీలను రద్దుచేయాలని కోరారు. పాడి రైతులకు పొరుగు రాష్ట్రాల్లో ఇస్తున్న విధంగా లీటరుకు రూ.5 బోనస్ ఇవ్వాలని, కౌలురైతులకు బ్యాంక్ రుణాలు, సబ్సిడీలను అందించాలని కోరారు. ఈ డిమాండ్ల సాధనకు శుక్రవారం విజయవాడలోని అలంకార్ సెంటర్‌లోని ధర్నాచౌక్‌కు తరలిరావాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. వీరితోపాటు రైతు ప్రతినిధులు కన్నెగంటి భాస్కర్‌చంద్, పోతురాజు కోటేశ్వరరావు, జెట్టి బాలరాజు, యార్లగడ్డ బ్రహ్మేశ్వరరావు ఉన్నారు.

దుర్గమ్మ సేవలో డీజీపీ



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను రాష్ట్ర డీజీపీ ద్వారకా తిరుమలరావు దంపతులు గురువారం దర్శించుకున్నారు. ఈవో కె.రామచంద్రమోహన్ అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, పట్టువస్త్రాలను వారికి అందించారు.

‘కిక్కు’రుమనరే!

కూటమి ప్రభుత్వంలో మద్యం అస్తవ్యస్త విధానాల వల్ల వైన్స్ బార్లుగా మారుతున్నాయి. పర్మిషన్ లేకుండానే పర్మిట్ రూములు వెలుస్తున్నాయి. అనుమతుల్లేకుండానే టచ్చింగ్ వంటి అమ్మకాలు సాగుతున్నాయి. ఎక్సైజ్ అధికారుల కళ్లకు గంతలు కడుతూ గోవా, తెలంగాణ, హర్యానా మద్యం బాటిళ్లు యథేచ్ఛగా వస్తున్నాయి. మాచర్లలో మద్యం చుక్కలు లెక్క తప్పి ప్రభుత్వ ఖజానాకు గండి పెడుతున్నాయి.



వైన్స్ ఎదుట అందుబాటులో ఉంచిన వాటర్ క్యాన్లు పక్కనే బహిరంగంగా మద్యం తాగుతున్న దృశ్యం

మాచర్లలో బారుల్లా వైన్స్

- ఇతర రాష్ట్రాల మద్యమూ అమ్మకం
- నిబంధనలకు విరుద్ధంగా పర్మిట్ రూమ్స్
- కన్నెత్తి చూడని ఎక్సైజ్ అధికారులు
- మామూళ్ల మత్తే కారణమా!



వైన్స్‌లో సిట్టింగ్ ఏర్పాటు చేయడంతో మద్యం తాగుతున్న మందుబాబులు

నరసరావుపేటటౌన్: మాచర్లలో మద్యం వ్యాపారులు బరితెగించారు.. పగలు, రాత్రి తేడా లేకుండా యథేచ్ఛగా అక్రమ విక్రయాలకు పాల్పడుతున్నారు. ఇతర రాష్ట్రాల మద్యాన్ని దుకాణాల్లో బహిరంగంగా విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ తంతు యథేచ్ఛగా జరుగుతున్నా నివారణకు చర్యలు చేపట్టాల్సిన ఎక్సైజ్ అధికారులు మాముళ్ల మత్తులో జోగుతున్నారు. మాచర్ల పట్టణంలో ప్రధానంగా రాయవరం జంక్షన్, రింగ్ రోడ్డు, స్టేషన్ రోడ్డు, అంబేడ్కర్ విగ్రహం సమీపంలోని వైన్స్‌ల నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. దుకాణాల వద్ద గ్రీన్ మ్యాట్‌లు అడ్డుగా కట్టి అక్కడ నిబంధనలకు విరుద్ధంగా సిట్టింగ్ ఏర్పాటు చేశారు. మద్యం తాగేందుకు వచ్చే మందు బాబులకు సకల సౌకర్యాలు అందిస్తున్నారు. దీంతోపాటు మద్యం దుకాణాలకు ఎదుట రోడ్లపై మందుబాబులు బహిరంగంగా మద్యం తాగుతున్నారు. కూలింగ్ వాటర్ క్యాన్ల ద్వారా లూజ్ వాటర్, గ్లాసులు దుకాణాల ఎదుట విక్రయిస్తున్నారు. దీంతో మందుబాబులు వైన్స్‌ల్లో మద్యం కొనుగోలు చేసి అక్కడే తాగుతున్నారు. మద్యం వ్యాపారులంతా అధికార పార్టీకి చెందిన వారు కావటంతో యథేచ్ఛగా ఉల్లంఘనలకు పాల్పడుతున్నా అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు లేకపోలేదు. దీంతోపాటు ఒక్కో దుకాణం నుంచి నెలకు రూ.50 వేలు అధికారులకు మామూళ్లు అందుతున్నట్లు వ్యాపారులు బహిరంగంగా వ్యాఖ్యానిస్తున్నారు.

యథేచ్ఛగా ఇతర రాష్ట్రాల మద్యం అమ్మకం

మాచర్ల నియోజకవర్గంలో ఇతర రాష్ట్రాల మద్యం యథేచ్ఛగా లభిస్తోంది. గోవా, హర్యానా రాష్ట్రాల నుంచి అక్రమార్కులు మద్యాన్ని తీసుకొచ్చి వాటిని ఆంధ్రరాష్ట్రానికి చెందిన బాటిళ్లలో నింపి విక్రయాలకు పాల్పడుతున్నారు. మరి కొన్ని ప్రాంతాల్లో యథేచ్ఛగా గోవా మద్యాన్ని విక్రయిస్తున్నారు. ఫలితంగా ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతోంది. ఇటీవల వెల్దుర్తి మండలంలో గోవా మద్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. కొన్ని వైన్స్‌ల్లో గోవా మద్యాన్ని లేబుళ్లు మార్చి విక్రయిస్తున్నట్లు సమాచారం.

ఎనీటైం మందు..

వైన్స్‌లలో పగలు, రాత్రి తేడా లేకుండా 24 గంటలు మద్యం అమ్ముతున్నారు. మద్యం దుకాణాల షెటర్లు మూసి వేసి చిన్న కంత పెట్టి అందులో నుంచి రాత్రుళ్లు మద్యం విక్రయాలకు పాల్పడుతున్నారు. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే నిబంధనల ప్రకారం మద్యాన్ని దుకాణాల్లో విక్రయించాలి. అయితే యథేచ్ఛగా రాత్రింబవళ్లు దుకాణాలు తెరిచి ఉన్నా అధికారులు ఆవైపు కన్నెత్తి కూడా చూడరు. మద్యం తాగి రాత్రుళ్లు మందు బాబులు చేస్తున్న గొడవలతో స్థానికులు బెంబేలెత్తిపోతున్నారు.

బెల్టు షాపులకు సరఫరా..

మాచర్ల పట్టణంలోని మూడు మద్యం దుకాణాల నుంచి బెల్టు షాపులకు మద్యం సరఫరా అవుతోంది. ప్రతిరోజూ గ్రామీణ ప్రాంతాల్లో బెల్టు షాపులు నిర్వహించే వారు పట్టణానికి వచ్చి పెద్ద మొత్తంలో మద్యం కొనుగోలు చేసుకొని పోతున్నారు. కొందరు వైన్స్ నిర్వాహకులు ప్రత్యేకంగా సిబ్బందిని నియమించి బెల్టు షాపులకు మద్యం సరఫరా చేస్తున్నారు. ఒక్కో క్వార్టర్‌కు ఎమ్మార్పీ కంటే రూ.10 అదనంగా బెల్టు షాపుల నిర్వాహకులకు మద్యం దుకాణా నిర్వాహకులు విక్రయిస్తున్నారు. ఆ మద్యాన్ని గ్రామాల్లో క్వార్టర్‌కు రూ.50 అదనంగా విక్రయించి బెల్టు షాపుల వాళ్లు సొమ్ము చేసుకుంటున్నారు.

చర్యలు తీసుకుంటాం



మద్యం దుకాణ నిర్వాహకులు నిబంధనల ప్రకారం నడుచుకోవాలి. అతిక్రమిస్తే లైసెన్స్ రద్దుకు చర్యలు తీసుకుంటాం. మద్యం దుకాణాలపై ఎప్పటికప్పుడు ఆకస్మికంగా దాడులు నిర్వహించాలని ఇప్పటికే అధికారులను ఆదేశించాం. మాచర్లలో మద్యం దుకాణాలపై తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకుంటాం.

– కె.మణికంఠ, ఎక్సైజ్ సూపరింటెండెంట్

విధి నిర్వహణలో అప్రమత్తత అవసరం

ఆర్టీసీ జిల్లా ప్రజారవాణా అధికారి శ్రీనివాసరావు



భద్రతా మాసోత్సవాల్లో పాల్గొన్న జిల్లా అధికారి శ్రీనివాసరావు, డిపో మేనేజర్ కుమార్

నరసరావుపేట: ఆర్టీసీ సిబ్బంది విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని జిల్లా ప్రజా రవాణా అధికారి ఎస్.శ్రీనివాసరావు పేర్కొన్నారు. గురువారం స్థానిక ఏపీఎస్ ఆర్టీసీ బస్టాండ్‌లో డిపో మేనేజర్ జీవీఎస్ఎస్ మూర్తి అధ్యక్షతన రోడ్డు భద్రతా మాసోత్సవాల ప్రారంభోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా ప్రజా రవాణా అధికారి ఎస్.శ్రీనివాసరావు మాట్లాడుతూ భద్రతా మాసోత్సవాలు వచ్చే నెల 15వరకు నిర్వహించటం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా నెల రోజుల కార్యక్రమాలను గురించి వివరించారు. డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లకు విధి నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలియచేశారు. గ్యారేజీ ఇన్‌చార్జి లావణ్య, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులు అన్నిరంగాల్లో ముందుండాలి

తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా



ఉప్పల శ్రీనివాస్ గుప్తాను సత్కరిస్తున్న ఆర్యవైశ్య నాయకులు, వైఎస్సార్ సీపీ నాయకులు

పిడుగురాళ్ల: ఆర్యవైశ్యులు అన్నిరంగాల్లో ముందుండి అందరికీ ఆదర్శవంతంగా నిలబడాలని తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా తెలిపారు. గురువారం హైదరాబాద్ నుంచి ఒంగోలు వెళుతూ మధ్యలో పిడుగురాళ్లలో కాసేపు ఆగారు. పట్టణంలోని ఆర్యవైశ్య నేతలు ఉప్పల శ్రీనివాస్ గుప్తాకు ఘన స్వాగతం పలికి దుశ్శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గుప్తా మాట్లాడుతూ... పిడుగురాళ్ల ప్రాంతానికి చెందిన ఆర్యవైశ్యులు జాతీయ స్థాయిలో పదవుల్లో ఉన్నారని, అన్నిరంగాల్లో ఆర్యవైశ్యులు ముందు ఉండి సేవా కార్యక్రమాలు నిర్వహించి దేశానికి ఆదర్శంగా నిలవాలని సూచించారు. అనంతరం ఉప్పల ఫౌండేషన్ కో–చైర్మన్ ఉప్పల సాయితేజకు కూడా ఘనస్వాగతం పలికారు. ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు జూలకంటి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు, విద్యాశాఖ రాష్ట్ర మాజీ డైరెక్టర్ చింతా వెంకట రామారావు, ఆర్యవైశ్య యువ నాయకులు పతంగి అమర్, మద్దాలి శివ, ఆలేటి కనకయ్య, దేవరపల్లి కృష్ణప్రసాద్, తోటా బుచ్చిబాబు, పలువురు ఆర్యవైశ్య నాయకులు పాల్గొన్నారు.

తరాల సంక్రాంతి.. తరగని కాంతి



సీతారామస్వామి దేవాలయంలోని కల్యాణ మండపంలో సమావేశమైన మండవ, పెనుగొండ కుటుంబాల సభ్యులు

- గత 11 ఏళ్లుగా సమావేశమవుతున్న మండవ, పెనుగొండ కుటుంబాల నాలుగు తరాల సభ్యులు
- ఉల్లాసభరిత వాతావరణంలో సంక్రాంతి వేడుకలు

నరసరావుపేట: పట్టణంలోని మండవ, పెనుగొండ కుటుంబ సభ్యులు 89మంది సంక్రాంతి పర్వదినాన మరోసారి సమావేశమయ్యారు. రాష్ట్రంలోని వివిధ ప్రదేశాల్లో నివాసం ఉండే ఈ రెండు కుటుంబాలకు చెందిన వారు గత 11 ఏళ్ల నుంచి సంక్రాంతి పర్వదినాన సమావేశమవుతున్నారు. సుమారు నాలుగు తరాలకు చెందిన వీరు మూడురోజుల పాటు పట్టణంలోని పాతూరులో గల సీతారామస్వామి దేవాలయంలోని కల్యాణ మండపంలో సమావేశమై ఉల్లాసభరితమైన వాతావరణంలో ఆటపాటలతో పండుగ జరుపుకొన్నారు.

ఏటీఎం మోడల్‌తో నిరంతర ఆదాయం



ప్రకృతి వ్యవసాయం ద్వారా పండిస్తున్న ఆకుకూరలను పరిశీలిస్తున్న డీపీఎం అమలకుమారి

నరసరావుపేట రూరల్: ప్రకృతి వ్యవసాయంలో ఏటీఎం మోడల్ ద్వారా నిరంతరం ఆదాయం పొందవచ్చని డీపీఎం కె.అమలకుమారి తెలిపారు. పట్టణంలోని పోస్టల్ కాలనీలో ప్రకృతి వ్యవసాయ విధానంలో ఆకుకూరలు, కూరగాయలు సాగుచేస్తున్న కోడూరి వెంకటేశ్వరరెడ్డి పొలాన్ని గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెండు ఎకరాల్లో అన్ని రకాల ఆకుకూరలు, కూరగాయలు వెంకటేశ్వరరెడ్డి పండిస్తున్నట్టు తెలిపారు. ఆకుకూరలు కట్ట రూ.10కే విక్రయిస్తున్నారని, వినియోగదారులు పొలం వద్దకే వచ్చి కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. మూడు అడుగుల వెడల్పుతో బెడ్స్ వేసుకొని వాటిలో అవసరం మేరకు విత్తే దశలో, పెరిగే దశలో, పాత దశలో ఉండే విధంగా తోటకూర, చుక్కకూర, పాలకూర, గోంగూర, కొత్తిమీరతో పాటు టమాటాలు, గోరుచిక్కుడు, వంగ, మిరప, క్యాబేజీ, బెండలతో పాటు తీగజాతి కూరగాయలను పండిస్తున్నారని వివరించారు. ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్లో ఈ ఉత్పత్తులను అందుబాటులో ఉంటాయని తెలిపారు.

చదువులమ్మ చెట్టు నీడలో..!

- 25 సంవత్సరాల తరువాత కలుసుకున్న పూర్వవిద్యార్థులు
- తుమ్మేపల్లి శ్రీరాములు జెడ్పీ హైస్కూల్‌లో 2000–01 బ్యాచ్ టెన్త్ విద్యార్థుల 'అపూర్వ' సమ్మేళనం

అచ్చంపేట: స్థానిక శ్రీ తుమ్మేపల్లి శ్రీరాములు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2000–01 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదివిన విద్యార్థులంతా 25 సంవత్సరాల తరువాత కలుసుకున్నారు. పాఠశాలలో గురువారం ఆత్మీయ సమ్మేళనం జరిగింది. పూర్వ విద్యార్థులు పాఠశాల పరిసరాలు కలయతిరిగి నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. అప్పటి విద్యార్థులంతా ఇప్పుడు వివిధ వృత్తులలో ఇంజినీర్లు, డాక్టర్లు, ఉపాధ్యాయులు, లాయర్లు, రాజకీయ ప్రముఖులు, వ్యాపారస్తులు, పారిశ్రామిక వేత్తలు, రైతులు, కాంట్రాక్టర్లు, తాపీమేస్త్రీలు, గృహిణిలుగా.. ఇలా స్థిరపడ్డారు. ఇప్పటి వారి హోదాలగురించి పట్టించుకోకుండా పాఠశాలకు రాగానే వారంతా ఒక్కసారిగా విద్యార్థుల్లా మారిపోయారు. టెన్త్‌లో ఎవరు ఎక్కడ కూర్చునేవారు, ఎవరిపక్కన ఎవరు ఉండేవారో అలానే బల్లలపై కూర్చున్నారు. ఎవరు ఏం చేస్తున్నారో కుశల ప్రశ్నలు వేసుకున్నారు. చదువులు చెప్పిన నాటి ఉపాధ్యాయులందరిని పిలిచి దుశ్శాలువాలు, జ్ఞాపికలు, పూలమాలలతో ఘనంగా సన్మానించుకున్నారు. ఉపాధ్యాయుల దీవెనలతోనే తాము ఈరోజు ఈ స్థాయిలో ఉన్నామంటూ తమ తమ అనుభవాలను వ్యక్తపరచారు. ఆనాటి హెచ్‌ఎం గోళ్ల మూడి పాపారావు, ఉపాధ్యాయులు చలపతిరావు, మార్కు మస్టారు, సాంబశివరావు, పీఈటీ కమతం శ్రీనివాసరావు, డ్రాయింగ్ టీచర్ మల్లేశ్వరి, తదితర గురువులతో కలసి సహపంక్తి భోజనాలు చేశారు. అప్పటి టెన్త్ చదివిన బ్యాచ్‌లో సుమారుగా 80 శాతానికి పైగా విద్యార్థులు హాజరయ్యారు. మిగిలిన 20 శాతంలో విదేశాలలో స్థిరపడినవారు, కొన్ని అనివార్య పరిస్థితులవల్ల రాలేని వారంతా ఫోన్లు ద్వారా పలుకరించుకుని గురువుల ఆశీర్వాదాన్ని పొందారు.



25 సంవత్సరాల తరువాత పాఠశాలలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

రోడ్డు ప్రమాదంలో ఎస్‌బీఐ క్రెడిట్‌కార్డ్ మేనేజర్ దుర్మరణం

మరో వ్యక్తికి గాయాలు



మన్నెం వెంకట రాజేష్ (ఫైల్)

నాదెండ్ల: రోడ్డు ప్రమాదంలో గుంటూరు ఎస్‌బీఐ క్రెడిట్ కార్డ్ కలెక్షన్ మేనేజర్ మన్నెం వెంకటరాజేష్ (45) దుర్మరణం పాలయ్యారు. గుంటూరు–కర్నూలు జాతీయ రహదారిపై సాతులూరు గ్రామ సమీపంలోని హోసన్న ప్రార్థనా మందిరం వద్ద గురువారం మధ్యాహ్నం ప్రమాదం జరిగింది. ఎస్‌ఐ జి.పుల్లారావు తెలిపిన వివరాల మేరకు గుంటూరు వసంతరాయపురం సమీపంలోని వెంగయ్యనగర్ నాలుగో లైనుకు చెందిన మన్నెం వెంకటరాజేష్ ఎస్‌బీఐ క్రెడిట్ కార్డు విభాగంలో మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. గుంటూరుకు చెందిన మరో వ్యక్తి వినుకొండ నవీన్ క్రెడిట్ కార్డు ఏజెన్సీ టీం లీడర్‌గా పనిచేస్తున్నాడు. వీరిరువురూ ద్విచక్రవాహనంపై నరసరావుపేటకు వెళ్తూ సాతులూరు చర్చి వద్దకు రాగానే గేదెను తప్పించే క్రమంలో వెనుకగా వస్తున్న కియా కారు ఢీకొంది. తీవ్రంగా గాయపడిన వెంకటరాజేష్‌ను కారులో నరసరావుపేట తీసుకువెళ్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. వాహనం నడుపుతున్న నవీన్‌కు గాయాలు కావటంతో ఆసుపత్రిలో చేర్చారు. వెంకటరాజేష్ మృతదేహాన్ని నరసరావుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుని మేనల్లుడు వేములకొండ విజయ్‌కుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

తప్పిపోయిన బాలుడు తల్లిదండ్రులకు అప్పగింత



బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీస్ సిబ్బంది

మంగళగిరి (తాడేపల్లి రూరల్): ఉదయం తప్పిపోయిన బాలుడ్ని గంటల వ్యవధిలోనే తల్లిదండ్రులకు అప్పగించిన సంఘటన గురువారం పట్టణంలో చోటుచేసుకుంది. మంగళగిరి పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణ పరిధిలోని టిడ్కో గృహ సముదాయాల్లో నివాసముంటున్న దంపతులకు మతిస్థిమితం లేని కుమారుడు (8) ఉన్నాడు. గురువారం ఉదయం నుంచి కనిపించకపోవడంతో చుట్టుపక్కల ప్రాంతాలన్నీ వెదికారు. మంగళగిరి బస్టాండ్ ఎదురు రోడ్డులో ఓ గుర్తుతెలియని వాహనం సదరు బాలుడ్ని ఢీకొని వెళ్లిపోవడంతో చుట్టుపక్కల ఉన్న కొంతమంది యువకులు ఆరా తీశారు. మతిస్థిమితం లేని బాలుడు ఏమీ మాట్లాడలేకపోవడంతో పోలీసులకు అప్పగించారు. రెండు గంటల వ్యవధిలో బాలుడి తల్లిదండ్రులు పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదు చేయడానికి వచ్చారు. అక్కడ తమ కుమారుడిని చూసి విలపించారు. కుమారుడిని పోలీసులకు అప్పగించిన యువకులకు, పోలీస్ సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి



మహిళ మృతదేహం

తెనాలి రూరల్: తెనాలిలో ఓ మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. పట్టణంలోని ముత్తెంశెట్టిపాలెం నుంచి ఇస్లాంపేట వైపు వెళ్లే మార్గంలో రోడ్డు పక్కన ఆమె మృతి చెంది ఉండటాన్ని గురువారం స్థానికులు గుర్తించారు. తమిళనాడుకి చెందిన మణి అనే వ్యక్తితో 50 ఏళ్ల ఈ మహిళ కొంత కాలంగా కలిసి ఉంటోందని చెబుతున్నారు. మణి కర్రీ పాయింట్‌లో పని చేస్తుండగా, మహిళ బిక్షాటన చేసేదన్నారు. గత రాత్రి రోడ్డు పక్కన నిద్రించిన మహిళ తెల్లవారే సరికి మృతి చెంది ఉండటం చర్చనీయాంశమైంది. రాత్రి ఇద్దరూ కలిసి మద్యం తాగి గొడవపడి ఉంటారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మహిళ ప్రైవేటు శరీర భాగాల నుంచి తీవ్రంగా రక్తస్రావం అయినట్లుగా తెలుస్తోంది. మణిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. మహిళ మృతదేహాన్ని తెనాలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనాస్థలాన్ని డీఎస్పీ బి. జనార్దనరావు, వన్ టౌన్ సీఐ వి.మల్లికార్జునరావులు పరిశీలించారు. హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోడి పందేలు వద్ద ఘర్షణ

బీరు సీసాలతో పొడుచుకున్న యువకులు

చుండూరు(వేమూరు): మద్యం బీరు సీసాలతో యువకులు పొడుచుకున్నారని ఎస్‌ఐ షేక్ రహిమాన్ తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం...సంక్రాంతి సంబరాలలో భాగంగా చుండూరు మండలం కేఎస్ పల్లి సమీపంలో కోడి పందేలు నిర్వహించారు. బుధవారం చేబ్రోలు గ్రామానికి చెందిన మదాసు అక్షయకుమార్, మాటుపల్లి రాజేష్, ముసలా శ్రీనివాసరావులు కోడి పందేలు చూసేందుకు వచ్చారు. కోడి పందేలు చూసిన తర్వాత ముగ్గురు కలసి సైకిల్ స్టాండ్ వద్ద బీరు తాగుతున్నారు. అక్షయకుమార్, శ్రీనివాసరావు మధ్య మాటామాట పెరిగింది. దీంతో శ్రీనివాసరావు బీరు బాటిల్ పగలు కొట్టి అక్షయకుమార్‌ను పొడిచాడు. అనంతరం రాజేష్ బీరు బాటిల్‌తో శ్రీనివాసరావును పొడిచాడు. ముగ్గురికి గాయాలయ్యాయి. 108 వాహనంలో అక్షయకుమార్, రాజేష్‌లను తెనాలిలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. శ్రీనివాసరరావును ప్రైవేటు వైద్యశాలలో చేర్పించారు. వైద్యులు వైద్య సేవలు అందిస్తున్నారు. ముగ్గురిపైన కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

డ్రైవింగ్ శిక్షణ తరగతులు ప్రారంభం



పట్నంబజారు: డ్రైవర్లు విధి నిర్వహణలో బాధ్యతగా వ్యవహరించాలని ఏపీఎస్ ఆర్టీసీ రీజియన్ మేనేజర్ ఎం.రవికాంత్ చెప్పారు. గుంటూరు జిల్లా పరిధిలోని హెవీ మోటారు వెహికల్ డ్రైవింగ్ స్కూల్ 18 బ్యాచ్‌కు శిక్షణ తరగతులు గురువారం బస్టాండ్‌లో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆర్‌ఎం మాట్లాడుతూ.. హెవీ డ్రైవింగ్ స్కూల్‌లో సీనియర్ డ్రైవర్ల చేత నాణ్యమైన శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డిపో –2 మేనేజర్, డ్రైవింగ్ స్కూల్ ప్రిన్సిపల్ షేక్ అబ్దుల్‌సలాం పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం పై నుంచి పడి మహిళ మృతి

గురజాల: ద్విచక్ర వాహనంపై నుంచి పడి మహిళ మృతి చెందిన ఘటన మండలంలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం.. దాచేపల్లి మండలం తక్కెళ్లపాడు గ్రామానికి చెందిన పిందెబోయిన నాగలక్ష్మి(30) సంక్రాంతి పండుగ సందర్భంగా గురజాల మండలం గొట్టిముక్కల గ్రామానికి పుట్టింటికి వచ్చింది. పండుగ అనంతరం తిరిగి తన సోదరుడి ద్విచక్రవాహనంపై తక్కెళ్లపాడు వెళ్తుండగా మార్గ మధ్యలో దైద గ్రామ సమీపంలో వాహనంపై నుంచి కిందపడింది. ఈ ప్రమాదంలో నాగలక్ష్మికి తీవ్ర గాయాలయ్యాయి. నాగలక్ష్మిని గురజాల సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతురాలికి భర్త ఇద్దరు పిల్లలున్నారు.

స్టాండింగ్ కమిటీ ఎన్నికకు నోటిఫికేషన్

నెహ్రూనగర్: గుంటూరు నగర పాలక సంస్థ స్టాండింగ్ కమిటీ ఎన్నికలు ఫిబ్రవరి 3న ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 3 వరకు నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో జరుగుతాయని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు నోటిఫికేషన్ విడుదల చేశారు. గురువారం నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ వివరాలు ప్రకటించారు. ప్రస్తుతం ఉన్న స్టాండింగ్ కమిటీ సభ్యుల ఎన్నిక కాలపరిమితి గత సంవత్సరం ఆగస్టుతో ముగిసింది. ఇప్పటి వరకు ఉన్న సభ్యులతోనే స్టాండింగ్ కమిటీ నడిచింది. ఎన్నికలకు సంబంధించి ఎలక్షన్ నోటిఫికేషన్ ఓటర్ల లిస్టు 16వ తేదీన ప్రకటించామని, ఓటర్ల లిస్టు, నోటిఫికేషన్‌ను నగర పాలక సంస్థ నోటీసు బోర్డులో ఏర్పాటు చేశామన్నారు. ఈ నెల 22 నుంచి 24వ తేదీ వరకు ఉదయం 11– సాయంత్రం 3 గంటల వరకు నగర అదనపు కమిషనర్ చాంబర్‌లో నామినేషన్‌లు దాఖలు చేయవచ్చునన్నారు. 24న అందిన నామినేషన్ల ప్రకటన, 27న ఉదయం 11 – 12 గంటల వరకు నామినేషన్ల స్క్రూటినీ జరుగుతుందని, అదే రోజు వ్యాలిడ్ నామినేషన్ల ప్రకటన ఉంటుందన్నారు. ఈ నెల 30వ తేదీ మధ్యాహ్నం 12 – సాయంత్రం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణ గడువు ఉంటుందని, అనంతరం తుది పోటీలోని అభ్యర్థులను ప్రకటిస్తామని చెప్పారు. ఫిబ్రవరి 3న ఉదయం 10.30 – సాయంత్రం 3 వరకు సమావేశ మందిరంలో ఎన్నిక జరుగుతుందని వెల్లడించారు. అదే రోజు ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి ఉంటాయన్నారు.

వీరుల ఆయుధాలకు శాంతి క్రతువులు



నాగులేరు ఒడ్డున పూజలు జరిపించి వీర్లగుడికి బయలు దేరిన వీరాచారులు

కారెంపూడి: పల్నాటి రణక్షేత్రం కారెంపూడిలో కారెంపూడికి చెందిన కిల్లా కోటయ్య, కోటమ్మల కుటుంబీకులు తమ ఇళ్లలో ఉన్న పల్నాటి వీరుల ఆయుధాలకు శాంతి కార్యక్రమాలు నిర్వహించి పల్నాటి వీరాచారాన్ని గురువారం పునఃప్రతిష్ట చేసుకున్నారు. 60 ఏళ్ల క్రితంవరకు తమ పూర్వీకులైన వీర్లకు పెట్టుకున్న ఆ కుటుంబీకులు ఆతర్వాత మానేసి తర్వాత మళ్లీ జరిగిన పారపాటును గుర్తించి వీర్ల ఆయుధాలకు శాంతి కార్యక్రమాల క్రతువులు నిర్వహించారు. నాగులేరు ఒడ్డున ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం వీర్లగుడికి చేరుకుని అక్కడ పోతురాజుకు నైవేద్యం, ఇతర మొక్కులు చెల్లించారు. తర్వాత వీర్లగుడికి, తర్వాత చెన్నకేశవస్వామి, వీర్ల అంకాలమ్మ తల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఇళ్లకు చేరుకుని ఇళ్లలో వీర్ల అంకాలమ్మ తల్లి బుట్టను కత్తులను పెట్టి సాంబ్రాణి వేసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అందరికీ సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో విశ్రాంత డీటీ రామకృష్ణారావు, ఎంపీపీ బొమ్మిన సావిత్రి అల్లయ్య పాల్గొన్నారు. కిల్లా పెదకోటేశ్వరరావు, చెన్నకేశవ స్వామి మాజీ ట్రస్టు బోర్డు చైర్మన్ కిల్లా చినకోటేశ్వరరావు వీర్ల ఆయుధాలకు శాంతి కార్యక్రమాలు చేశారు. వీర్ల గుడి పూజారులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. కారెంపూడి రణక్షేత్రంలో వీరాచారాన్ని వదలివేసిన వారు మళ్లీ స్వీకరించడం ఇక్కడ విశేషం. గతంలో జక్కా కుటుంబీకులు వీర్లకు పెట్టుకుని పునః ప్రతిష్టకు శ్రీకారం చుట్టారు. తర్వాత రణక్షేత్రంలో ఇది రెండవ కార్యక్రమం.

దళితులపై కూటమి ప్రభుత్వానికి ద్వేషం


- అమలాపురం మాజీ ఎంపీ హర్షకుమార్
- పొనుగుపాడులో దళితులకు పరామర్శ



బాధితులతో మాట్లాడుతున్న మాజీ ఎంపీ హర్షకుమార్

ఫిరంగిపురం: కూటమి ప్రభుత్వానికి దళితులంటే ద్వేషం అని అమలాపురం మాజీ ఎంపీ హర్షకుమార్ అన్నారు. మండలంలోని పొనుగుపాడు గ్రామం ఎస్సీకాలనీలోని బాధిత దళితులను గురువారం ఆయన పరామర్శించారు. చర్చిగోడకు సంబంధించి కూల్చివేసిన ఘటన గురించి వారిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజకీయ బలంతో పోలీసులను అడ్డుపెట్టుకొని దళితులను నిర్బంధించి గోడ కూలగొట్టి రోడ్డు వేశారన్నారు. ఇది దారుణమైన సంఘటన అని పేర్కొన్నారు. గ్రామంలో ఎప్పుడో బ్రిటీష్ వారి కాలంలో దళితులకు చర్చి కోసం స్థలం కేటాయించారని చెప్పారు. ఇక్కడి గోడను కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత కోర్టు కేసులను కూడా పట్టించుకోకుండా కూల్చివేశారని చెప్పారు. గతంలో కూడా ప్రకాశం జిల్లా పర్చూరు నియోజకవర్గం దేవరపల్లిలో ఈ తరహా సంఘటన జరిగిందన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో దళితులకు ఉన్నతస్థానం కల్పించారని తెలిపారు. నేడు కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత దళితులపై ప్రభుత్వానికి ఎందుకింత ద్వేషం అని ప్రశ్నించారు. ఇంత జరుగుతున్నా పచ్చ మీడియా కనీసం నోరు కూడా మెదపని పరిస్థితి నెలకొందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దళితులపై కక్షపూరితంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని మండిపడ్డారు. గ్రామంలో కూడా పేదదళితులు చర్చికి ఒకవైపు గోడ నిర్మించుకున్నారని, మరోవైపు డబ్బు లేక నిర్మించుకోలేదని చెప్పారు. అధికారబలంతో ఎంపీ, ఎమ్మెల్యే, ఎస్పీ, కలెక్టర్, అధికారులు కలిసి గోడను పడగొట్టించడం దారుణమన్నారు. దళిత ఎమ్మెల్యే అయి ఉండి కూడా ఇంత జరుగుతున్నా కనీసం నోరు విప్పకపోవడం సరికాదన్నారు. పేద ప్రజలు నమ్ముకున్న చర్చికి సంబంధించిన గోడను పునర్నిర్మించాలన్నారు. ప్రభుత్వం ఇచ్చిన స్థలాన్ని మరలా వారికి కేటాయించాలని డిమాండు చేశారు. సమావేశంలో స్థానిక నాయకులు గేరా కోటేశ్వరరావు, సేవా నాగరాజు, మేళం జోజిబాబులు పాల్గొన్నారు.

పురస్కారాలకు ఎంపికైన తెనాలి కవులు



షేక్ అస్మతున్నీసా | **డాక్టర్ రంగిశెట్టి రమేష్** | **డాక్టర్ పాతూరి సుబ్రహ్మణ్యం** | **ఆళ్ల నాగేశ్వరరావు**

తెనాలి: ప్రముఖ సాహితీ, సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ శ్రీశ్రీ కళావేదిక ఏటా బహూకరిస్తున్న తెలుగు కీర్తి జాతీయ ప్రతిభా పురస్కారాలకు తెనాలి నుంచి నలుగురు సాహితీ మూర్తులు ఎంపికయ్యారు. శ్రీశ్రీ కళావేదిక, తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ అకాడమీ బుక్ ఆఫ్ రికార్డ్స్, వరల్డ్ రైటర్స్ ఫోరం, వరల్డ్ పొయెట్రీ అకాడమీ సంయుక్తంగా ఈ పురస్కారాలను ప్రదానం చేస్తున్నాయి. ఈ నెల 21వ తేదీన విజయవాడలో సాహిత్య సభలో పురస్కారాలను అందజేస్తారు. శ్రీశ్రీ కళావేదిక చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ ఈ మేరకు సమాచారం పంపారు. పురస్కారాలను అందుకోనున్న వారిలో తెనాలికి చెందిన ప్రముఖ కవయిత్రి/తెలుగు ఉపాధ్యాయిని షేక్ అస్మతున్నీసా, రంగిశెట్టి ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ రంగిశెట్టి రమేష్ (గంగాశ్రీ), సాహితీబంధువు ఆళ్ల నాగేశ్వరరావు (కమలశ్రీ), ప్రముఖ పద్యకవి డాక్టర్ పాతూరి సుబ్రహ్మణ్యం ఉన్నారు. వీరిని పట్టణానికి చెందిన పలువురు రచయితలు అభినందించారు.

యువకుడిపై హత్యాయత్నం



చికిత్స పొందుతున్న సుభాని

తెనాలి రూరల్: తెనాలిలో యువకుడిపై హత్యాయత్నం జరిగింది. వెండి పని చేసుకునే తేలప్రోలు గ్రామానికి చెందిన షేక్ సుభానీపై గురువారం ఉదయం నడిరోడ్డుపై ఈ హత్యాయత్నం చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. తేలప్రోలుకు చెందిన షేక్ సుభానీ తన సోదరుడు బాజీతో కలిసి ఓ ఫంక్షన్‌కు మిత్రులను పిలిచేందుకు తెనాలి వచ్చాడు. గాంధీచౌక్ నుంచి కొత్తపేట వెళ్లే దారిలో రోడ్డు పక్కన నిలబడి ఉండగా తేలప్రోలుకు చెందిన అరాఫత్, ఇర్ఫాన్‌లు వచ్చి కత్తితో దాడి చేశారు. సుభానీ తీవ్రంగా గాయపడటంతో తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అత్యవసర విభాగంలో చికిత్స అందిస్తున్నారు. సుభానీ బంధువులు, ఘటన జరిగిన సమయంలో అక్కడే ఉన్న సోదరుడు మాట్లాడుతూ.. తమ ఊరికే చెందిన అరాఫత్, ఇర్ఫాన్‌లు ఈ దారుణానికి పాల్పడినట్లు తెలిపారు. అరాఫత్ తరచూ ఘర్షణకు దిగుతున్నాడని, రెక్కీ నిర్వహించి మరీ కత్తులతో తిరుగుతున్నారని తెలిపారు. అదేమంటే తమకు జనసేన అండ ఉందని చెబుతూ రెచ్చిపోతున్నారని వాపోయారు. ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.